31వ వసంతంలోకి

# చురకలు

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల

మంగళవారం 10 ఫిబ్రవరి 2026 పేజీలు : 8

## ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలి

◆ఓటు హక్కు వినియోగానికి 18 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒక్కటి తప్పనిసరి

◆జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్



**చురకలు ప్రతినిధి,జగిత్యాల, ఫిబ్రవరి 9 :** ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి,జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ అన్నారు.సోమవారం ఆయన మాట్లాడుతూ జగిత్యాల జిల్లాలోని 5 మున్సిపాలిటీల పరిధిలో ఈ నెల 11 తేదీన ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించు కునేందుకు పోలింగ్ కేంద్రాలకు వెళ్లే సమయంలో ఓటర్ స్లిప్పుతో పాటు 18 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకటి తప్పనిసరిగా వెంట తీసుకవెళ్లాలని జిల్లా ఎన్నికల అధికారి మరియు జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ తెలిపారు.ఓటర్ల సౌకర్యార్థం ఎన్నికల కమిషన్ అనుమతించిన గుర్తింపు కార్డులలో ఏదైనా ఒకటిని చూపించి ఓటు హక్కును వినియోగించుకోవచ్చని స్పష్టం చేశారు.




### మున్సిపల్ సమరం : చివరి అంకం ప్రారంభం

మున్సిపల్ ఎన్నికలు అనేవి కేవలం స్థానిక సంస్థల ప్రతినిధులను ఎన్నుకునే ప్రక్రియ మాత్రమే కావు; అవి పట్టణ ప్రజాస్వామ్యానికి అద్దం పట్టే రాజకీయ సామాజిక వ్యాయామం. వీటిలో జరిగే ప్రతి దశ ప్రజల దైనందిన జీవన ప్రమాణాలతో నేరుగా ముడిపడి ఉంటుంది. రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, పారిశుధ్యం, పట్టణ ప్రణాళిక, స్థానిక ఆదాయ వనరుల వినియోగం ఇవన్నీ మున్సిపల్ పాలన ద్వారా అమలవుతాయి. అందువల్ల ప్రచార పర్వం ముగిసిన తర్వాత మిగిలే "పోల్ మేనేజ్‌మెంట్" దశ ఎన్నికల ఫలితాన్ని మాత్రమే కాదు, ప్రజాస్వామ్య నమ్మకాన్ని కూడా ప్రభావితం చేసే కీలక ఘట్టంగా మారుతుంది. ఈ దశలో రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, ఎన్నికల యంత్రాంగం, ఓటర్లుఅందరూ తమ తమ బాధ్యతలను ఎలా నిర్వర్తిస్తారన్నది పట్టణ ప్రజాస్వామ్య నాణ్యతను నిర్ణయిస్తుంది.ప్రచార పర్వం ముగిసే వరకు రాజకీయ వాతావరణం ఉత్కం ఠ భరితంగా ఉంటుంది. అభ్యర్థులు తమ హామీలను, అభివృద్ధి దృక్పథాన్ని ప్రజల ముందుంచుతారు. అయితే ప్రచారం ముగిసిన క్షణం నుంచి ఎన్నికల పోటీ మరొక రూపం దాలుస్తుంది. ఇక్కడే పోల్ మేనేజ్‌మెంట్ అనే పదం ప్రాధాన్యం సంతరించుకుంటుంది.

-రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్

-మిగతా 2లో

# ప్రచార వాడి తగ్గింది...
# ఓటు వేడి మొదలైంది

## ఓటరు నీ ఓటు.. కోటర్‌కు అమ్ముకోకు

◆దొంగలకు సద్ది కట్టకండి...అవినీతి అభ్యర్థులకు ఓటేయకండి

◆భూ కబ్జాదారులు, అక్రమార్కులు, అవినీతిపరులకు చెక్ పెట్టండి



(కాలగిరి శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్)

ఇప్పుడు తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు ఎన్నికల హడావుడి నడుస్తోంది. ఇది చిన్న ఎన్నిక కాదు సోదరా. మీ ఇంటి ముందు తాగునీరు వస్తుందా? డ్రైనేజీ పొంగుతుందా? కుళాయిలు పనిచేస్తాయా? వీధి దీపాలు వెలుగుతాయా? రోడ్లు బాగుంటాయా? పార్కులు, మురుగు కాలువలు, మౌలిక వసతులు మెరుగుపడతాయా? అన్నదంతా ఈ ఓటుతోనే తేలుతుంది. అందుకే ఈసారి ఓటు వేయడమంటే కేవలం గుర్తు నొక్కడం కాదుడ భవిష్యత్తును నిర్ణయించడం. ఇప్పుడు ఓటు అడుగుతూ చాలా మంది నాయకులు దండాలు పెడతారు, చేతులు జోడిస్తారు. "ఒక ఫోన్ కాల్ చేస్తే చాలుడ వెంటనే పని" అంటారు. కానీ ఓటర్లారాడ నిజంగా వాళ్లకు స్పందించే గుణం ఉందా?ఇన్నాళ్లు అధికారంలో ఉన్నప్పుడు మీ ఫోన్ ఎత్తారా? మీ వీధిలో సమస్య వస్తే వచ్చారా?లేదా ఎలక్షన్ టైమ్ లోనే మీ ఇంటి మెట్టు ఎక్కారా?ఇదే కాదు ఇంకో ముఖ్యమైన విషయం కూడా బేరీజ్ చేయాలి.ఆ అభ్యర్థి భూ కబ్జాదారా? ఆక్రమార్కుడా?

2లో

## బాధితుల సమస్యలకు తక్షణ పరిష్కారానికి చర్యలు

◆జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఫిబ్రవరి 9 :** బాధితుల సమస్యలకు తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటూన్నామని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డే లో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 6 మంది ఆర్జీదారులతో నేరుగా మాట్లాడి తమ సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి పూర్తి వివరాలు సమర్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామన్నారు. బాధితుల సమస్యలు తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, పోలీస్ స్టేషన్ కు వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి చట్టపరంగా బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలని, ఫిర్యాదుదారునికి భరోసా, నమ్మకం కలిగించాలన్నారు. బాధితుల యొక్క ప్రతి ఫిర్యాదును ఆన్ లైన్ లో పొందుపరుస్తూ నిత్యం పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు.

## మూగబోయిన సప్పుడ్లు...

**-ఊపిరి పీల్చుకున్న మున్సిపాలిటీల ప్రజలు**



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ ఫిబ్రవరి 9 :** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పెద్దపల్లి జిల్లాలో ప్రచార మైకులు సోమవారం సాయంత్రం ఐదు గంటలకు మూగబోయాయి. పెద్దపెల్లి జిల్లాలో రామగుండం మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు పెద్దపల్లి,సుల్తానాబాద్,మంథని మున్సిపాలిటీలో ఈనెల 11న ఎన్నికలు జరగనున్నాయి. గత వారం రోజులుగా ఆయా గ్రామాల్లో మైకుల సౌండ్లతో ప్రచారాలతో దద్దరిల్లాయి. ప్రస్తుతం సోమవారం సాయంత్రం ఐదు గంటలకు ప్రచారానికి బ్రేక్ పడ్డది. దీంతో ఆయా మున్సిపల్ పరిధిలో ఎటువంటి మైకు సౌండ్ లేకుండా సైలెంట్ ప్రచారాలు ప్రారంభమయ్యాయి. కాగా ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఛాలెంజ్గా తీసుకొని ఎలాగైనా గెలవాలని ముమ్మర ప్రచారాలు చేశాయి.కరీంనగర్ పట్టణంతోపాటు పెద్దపల్లి జిల్లాలో కాంగ్రెస్ పార్టీని గెలుపు కోసం రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు అన్ని తానై ప్రచారంలో ముందున్నారు.అలాగే పెద్దపల్లి మున్సిపాలిటీతోపాటు రామగుండం కార్పొరేషన్,మంథని మున్సిపాలిటీని హస్తగతం చేసేందుకు ప్రచారంలో ముందు ఉన్నారు.అలాగే సుల్తానాబాద్ పెద్దపల్లి మున్సిపాలిటీలను తమ ఖాతాలో వేసుకోవాలని పెద్దపెల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు కాలుకు బట్ట కట్టకుండా తిరుగుతూ ముమ్మర ప్రచారం నిర్వహించారు.రామగుండం కార్పొరేషన్ పూర్తిస్థాయిలో కాంగ్రెస్ వాషం చేసుకోవడానికి రామగుండం ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజ్ ఠాకూర్ తన శక్తి సామర్థ్యాలను ప్రయోగించి ప్రచారంలో ముందున్నారు.ఎలాగైనా ఉనికిని చాటుకోవాలని టిఆర్ఎస్ బిజెపి పువ్వులు కోరుతున్నాయి.ఏది ఏమైనా 11న ఎన్నికలతో పాటు 13న ఫలితాలు తేట తెల్లం కానున్నాయి.

## కేంద్ర నిధులతోనే మున్సిపాలిటీల అభివృద్ధి

**-హుజూరాబాద్ మున్సిపాలిటీ పై కాషాయ జెండా ఎగురవేయాలి**

**-బిజెపి మహిళా నేత రాణి రుద్రమ**



**చురకలు ప్రతినిధి హుజూరాబాద్ ఫిబ్రవరి 9 :** కేంద్ర ప్రభుత్వ నిధులతోనే మున్సిపాలిటీల అభివృద్ధి జరుగుతుందని, హుజూరాబాద్ మున్సిపాలిటీపై కాషాయ జెండా ఎగరవేయాలని బిజెపి రాష్ట్ర మహిళా నేత రాణి రుద్రమ పిలుపునిచ్చారు. హుజూరాబాద్ లో సోమవారం బిజెపి మున్సిపల్ ఎన్నికల ప్రచార సభ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అధ్యక్షతన హుజూరాబాద్ లో జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హుజూరాబాద్ మున్సిపాలిటీని బిజెపికి అప్పగిస్తే అభివృద్ధి ఏంటో చూపిస్తామని, పట్టణ రూపురేఖలు మారుస్తామన్నారు. హుజూరాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన గత బిఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వానికి జరగబోయే మున్సిపాలిటీ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. హుజూరాబాద్ మున్సిపాలిటీ అభివృద్ధికి గత కెసిఆర్ బిఆర్ఎస్ ప్రభుత్వం , నేటి కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేసిందేమీలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్ల గడిచినా ఒక్క పైసా ఇవ్వలేదన్నారు. 2014 లో అధికారంలోకి వచ్చిన బిజెపి మోడీ ప్రభుత్వం పట్టణాల అభివృద్ధి కోసం కట్టుబడి పనిచేస్తుందన్నారు. మున్సిపాలిటీలు పట్టణాల అభివృద్ధికి నరేంద్ర మోడీ ప్రభుత్వం ఎంతో కృషి చేసిందన్నారు. కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ హుజూరాబాద్ పట్టణాన్ని మరింత అభివృద్ధి చేయాలని కృత నిశ్చయంతో ఉన్నారని తెలిపారు. ఆయన సహాయ సహకారాలతో కేంద్ర ప్రభుత్వం నిధులతో మున్సిపాలిటీలను అభివృద్ధి చేసే బాధ్యత బిజెపి తీసుకుంటుందని హామీ ఇచ్చారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. బిజెపి 30 వార్డుల అభ్యర్థులు, నాయకులు కార్యకర్తలు ఈ ప్రచారాల్లో పాల్గొన్నారు.

# ఓటరు నీ ఓటు.. కోటర్‌కు అమ్ముకోకు

**మొదటి పేజీ తరువాయి...** ప్రభుత్వ భూములు, లేఅవుట్లు, ఓపెన్ ప్లాట్లు, పార్కులు, చెరువులు కబ్జా చేసిన బ్యాక్‌గ్రౌండ్ ఉందా? అలాంటి వాళ్లే కౌన్సిలర్, కార్పొరేటర్ అయితే.. రేపు మీ ఊరి భూమి, మీ వీధి, మీ పిల్లల భవిష్యత్తు ఎవరి చేతుల్లో ఉంటది? ఇంకా చూడాల్సింది చాలానే ఉంది. రౌడీ ఇజం చేస్తాడా? బెదిరింపుల రాజకీయాలా?నేర ప్రవృత్తి ఉందా? అవినీతి కేసులు, దందాలు, అక్రమ సంపాదన ఆరోపణలు ఉన్నాయా? లేదా నిజంగా ప్రజలను కలుపుకొని పోయే మనసున్న మనిషా?ఇవి అన్నీ చూసి ఓటు వేయాలి. లేకపోతే మళ్లీ మోసపోవడం ఖాయం.సూటిగా చెప్పాలి అంటే.. భూ కబ్జాదారులకు సద్ది కట్టకండి.అక్రమాలు చేసి కోట్లు సంపాదించిన వాళ్లకు మళ్లీ ఓటు వేసి దందాలు పెట్టకండి. అవినీతిని వృత్తిగా మార్చుకున్న వాళ్లకు ఈసారి ఓటుతోనే బుద్ధి చెప్పాలి. గతంలో రాష్ట్రవ్యాప్తంగా చాలా మున్సిపాలిటీల్లో, కార్పొరేషన్లలో ఏమి జరిగిందో ప్రజలందరికీ తెలుసు. ముఖ్యంగా జగిత్యాల వంటి పట్టణాల్లో కొత్త ఇల్లు కట్టుకుంటే.. "పర్మిషన్ కావాలా? డబ్బులు పెట్టాలి"లక్ష... రెండు లక్షలు... మూడు లక్షలు కూడా. డబ్బులు ఇస్తే ఫైల్ కదులుతుంది. లేకపోతే నిబంధనల పేరుతో అడ్డంకులు, ఆక్రమణ నిర్మాణమని బెదిరింపులు.ఇది ఒక్క జగిత్యాల కథ కాదు.ఇది రాష్ట్రవ్యాప్తంగా చాలా మున్సిపాలిటీల్లో, కార్పొరేషన్లలో జరిగిన దుర్వినియోగం.అందుకే ఈ కథనం తెలంగాణ అంతటా ప్రతి ఓటరికి వర్తిస్తుంది. ఇలాంటి వాళ్లను మళ్లీ గెలిపిస్తే, వాళ్ల చేతుల్లో మళ్లీ మన జేబు పెట్టినట్టే. రేపు మరింతగా దోచుకుంటారు. అప్పుడు "నాయకులు మారరు" అని బాధపడినా ఉపయోగం ఉండదు. ఇప్పుడు వాళ్లే మళ్లీ వస్తారు.డబ్బు పంచుతారు, మద్యం ఇస్తారు,హామీలు గుప్పిస్తారు, "ఈసారి నిజంగా పని చేస్తా" అంటారు. ఓటర్లారా ఒక్కసారి మీ మనసులో ప్రశ్న వేసుకోండి.ఇన్నాళ్లు అధికారంలో ఉన్నప్పుడు తాగునీటి సమస్య తీర్చారా? డ్రైనేజీ బాగు చేశారా? వీధి దీపాలు వెలిగించారా? రోడ్లు వేశారా? లేదా మీ దగ్గర డబ్బులు తీసుకున్నారా? డబ్బు ఇచ్చి ఓటు కొనే వాడు, గెలిచాక వంద రెట్లు వసూలు చేస్తాడు.ఇది మన తెలంగాణ అనుభవమే.అందుకే ఈసారి ఒకే మాట..భూ కబ్జాదారులకు ఓటేయకండి. అక్రమార్కులను తిరస్కరించండి. అవినీతిపరులను బయటకు నెట్టండి. పార్టీ చూసి కాదుడ మనిషిని చూసి ఓటేయండి. ప్రజలకు అందుబాటులో ఉంటాడా? ఫోన్ చేస్తే స్పందిస్తాడా? అహంకారం లేకుండా మాట్లాడతాడా? అక్రమాలకు ఎదురెళ్లే ధైర్యం ఉందా? ప్రజలను కలుపుకునే తత్వం ఉందా? మంచి కౌన్సిలర్, మంచి కార్పొరేటర్ అంటే.. మీ ఇంటి ముందు కనిపించాలి, సమస్య వింటే తప్పించుకోకూడదు, పర్మిషన్ కోసం డబ్బులు అడగకూడదు, రౌడీ ఇజం కాకుండా సేవా భావం ఉండాలి. ఇది ఒక్క ఓటు కాదు సోదరా ఇది రాష్ట్రవ్యాప్తంగా అవినీతి నాయకులకు బుద్ధి చెప్పే అవకాశం.

**చివరిగా ఓటర్లారా దొంగలకు సద్ది కట్టకండి. మీ ఓటు అమ్మకండి. మీ పిల్లల భవిష్యత్తును తాకట్టు పెట్టకండి. ఈసారి నిజమైన ప్రజాసేవకుడినే గెలిపించండి. అప్పుడే మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు ప్రజలవవుతాయి దోపిడీదారులవి కావు.**

# ప్రచార వాడి తగ్గింది ఓటు వేడి మొదలైంది

**మొదటి పేజీ తరువాయి...** ఇది కేవలం ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు తీసుకురావడం అనే అర్థానికే పరిమితం కాదు; ఓటరు జాబితాల ఖచ్చితత్వం, బూత్ స్థాయి సమన్వయం, ఎన్నికల నియమావళి పాటించడం, పోలింగ్ రోజున శాంతిభద్రతలు కాపాడటం, ఓటింగ్ శాతం పెంచడం వంటి విస్తృత అంశాల సమాహారం. ఈ దశలో జరిగే చిన్న పొరపాటు కూడా ఎన్నికల పారదర్శకతపై అనుమానాలను రేకెత్తించగలదు.మున్సిపల్ ఎన్నికల్లో బూత్ స్థాయి నిర్వహణ ప్రత్యేక ప్రాధాన్యం కలిగి ఉంటుంది. పట్టణ ప్రాంతాల్లో ఓటర్ల సామాజికఆర్థిక వైవిధ్యం ఎక్కువగా ఉంటుంది. అపార్ట్‌మెంట్ సంస్కృతి, వలస జనాభా, తాత్కాలిక నివాసితులు, ఉద్యోగ నిమిత్తం తరచూ మారే ప్రజలుఇవన్నీ ఓటరు జాబితాల నిర్వహణను క్లిష్టతరం చేస్తాయి. ప్రచార దశలో అభ్యర్థులు ప్రజలతో సంబంధాలు పెంచుకోవడంపై దృష్టి పెడితే, పోల్ మేనేజ్‌మెంట్ దశలో ఆ సంబంధాలను ఓటుగా మలచడం లక్ష్యమవుతుంది. అయితే ఇది చట్టబద్ధ మార్గాల్లోనే జరగాలి. డబ్బు, మద్యం, ప్రలోభాల ద్వారా ఓటర్లను ప్రభావితం చేసే ప్రయత్నాలు ప్రజాస్వామ్య స్ఫూర్తిని దెబ్బతీస్తాయి. ఎన్నికల సంఘం అమలు చేసే నియంత్రణ చర్యలు ఈ నేపథ్యంలో కీలకమవుతాయి.పోలింగ్ రోజున శాంతియుత వాతావరణం నెలకొల్పడం ఎన్నికల యంత్రాంగానికి పెద్ద సవాల్. పట్టణాల్లో రాజకీయ పోటీ తీవ్రంగా ఉండటం సహజం. స్థానిక ప్రయోజనాలు, కాంట్రాక్టులు, పట్టణ వనరుల నియంత్రణ వంటి అంశాలు ఎన్నికల పోటీని మరింత కఠినతరం చేస్తాయి. అందువల్ల సున్నిత ప్రాంతాల్లో అదనపు భద్రత, సీసీటీవీ పర్యవేక్షణ, మైక్రో అబ్జర్వర్లు వంటి చర్యలు అవసరమవుతాయి. పోల్ మేనేజ్‌మెంట్‌లో రాజకీయ పార్టీల పాత్ర కూడా ఇక్కడే పరీక్షకు వస్తుంది. తమ కార్యకర్తలు నియమావళిని పాటించేలా చూడటం, ఉద్రిక్తతలకు తావు ఇవ్వకపోవడం, ఓటర్లను స్వేచ్ఛగా ఓటు వేయనివ్వడం ప్రజాస్వామ్య నిబద్ధతకు సూచిక.ఓటరు చైతన్యం ఈ దశలో అత్యంత ముఖ్యమైన అంశం. పట్టణాల్లో ఓటింగ్ శాతం తక్కువగా ఉండటం చాలా కాలంగా ఆందోళనకర అంశంగా ఉంది. చదువుకున్న వర్గాలు, మధ్యతరగతి ప్రజలు ఎన్నికల రోజున సెలవుదినంగా భావించి ఓటింగ్‌కు దూరంగా ఉండటం ప్రజాస్వామ్యానికి నష్టం. ప్రచార పర్వం ముగిసిన తర్వాత పోల్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు రప్పించే అవగాహన కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయి. ఎన్నికల సంఘం, స్వచ్ఛంద సంస్థలు, పౌర సమాఖ్యలు కలిసి ఓటు హక్కు ప్రాముఖ్యతను గుర్తుచేయాలి. పట్టణ అభివృద్ధి నేరుగా మున్సిపల్ పాలనపై ఆధారపడుతుందని ప్రజలు గ్రహించినప్పుడు ఓటింగ్ శాతం సహజంగానే పెరుగుతుంది.సాంకేతికత వినియోగం కూడా పోల్ మేనేజ్‌మెంట్‌లో కీలకంగా మారింది. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, ఓటరు ధృవీకరణ వ్యవస్థలు, డిజిటల్ ఓటరు జాబితాలు ఎన్నికల ప్రక్రియను వేగవంతం చేయడమే కాకుండా పారదర్శకతను పెంచుతున్నాయి. అయితే సాంకేతికతపై అపోహలు వ్యాప్తి చెందకుండా స్పష్టమైన సమాచారాన్ని అందించడం అవసరం. ఎన్నికల ప్రక్రియపై విశ్వాసం నిలబడాలంటే ప్రతి దశలో పారదర్శకత ఉండాలి. అభ్యర్థులు, పార్టీ ప్రతినిధులు, ఎన్నికల అధికారులు పరస్పర సహకారంతో పనిచేసినప్పుడు మాత్రమే ఈ లక్ష్యం సాధ్యమవుతుంది.మున్సిపల్ ఎన్నికల పోల్ మేనేజ్‌మెంట్‌లో సామాజిక సమీకరణాలు కూడా ప్రభావం చూపుతాయి. పట్టణాల్లో వర్గాల వారీగా ఓటింగ్ ధోరణులు మారుతూ ఉంటాయి. అభివృద్ధి, స్థానిక సమస్యలు, పౌర సదుపాయాల లభ్యత వంటి అంశాలు ఓటర్ల నిర్ణయాన్ని ప్రభావితం చేస్తాయి. ప్రచారంలో ఇచ్చిన హామీలను పోలింగ్ రోజున గుర్తుచేసే ప్రయత్నం సహజమే. అయితే ఇది నియమావళి పరిమితుల్లో ఉండాలి. ఎన్నికల సంఘం విధించిన మౌన కాలాన్ని గౌరవించడం ప్రజాస్వామ్య నైతికతకు సూచిక.పోల్ మేనేజ్‌మెంట్ దశలో మీడియా పాత్ర కూడా కీలకం. తప్పుడు వార్తలు, వదంతులు, సోషల్ మీడియా దుష్ప్రచారం ఎన్నికల వాతావరణాన్ని కలుషితం చేయగలవు. బాధ్యతాయుత జర్నలిజం, వాస్తవ నిర్ధారణ, సమతుల్య ప్రసారం ప్రజాస్వామ్యానికి రక్షణ కవచంలా పనిచేస్తాయి. ముఖ్యంగా పట్టణ యువత సోషల్ మీడియాపై ఎక్కువగా ఆధారపడుతున్న నేపథ్యంలో నిజమైన సమాచారం అందించడం అత్యవసరం.మున్సిపల్ ఎన్నికల అసలు లక్ష్యం పట్టణ పరిపాలనను ప్రజలకు దగ్గర చేయడం. పోల్ మేనేజ్‌మెంట్‌ను కేవలం రాజకీయ వ్యూహంగా కాకుండా ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగంగా చూడాలి. ఓటరు స్వేచ్ఛ, పారదర్శక ఎన్నికలు, సమాన అవకాశాలుఇవే ఈ దశలో ప్రధాన ప్రమాణాలు. ఎన్నికల ఫలితం ఏదైనా కావచ్చు; కానీ ప్రజాస్వామ్య నమ్మకం నిలబడితేనే వ్యవస్థ బలపడుతుంది. ప్రచార పర్వం ముగిసిన తర్వాతి ఈ నిశ్శబ్ద దశలోనే ఎన్నికల అసలు పరీక్ష జరుగుతుంది. నియమాలు పాటించబడుతున్నాయా? ఓటరు స్వేచ్ఛకు భంగం కలుగుతోందా? ఎన్నికల యంత్రాంగం సమర్థంగా పనిచేస్తుందా? అనే ప్రశ్నలకు సమాధానాలు ఇక్కడే దొరుకుతాయి.చివరికి మున్సిపల్ ఎన్నికలు పట్టణ భవిష్యత్తును నిర్ణయించే ప్రజా తీర్పు. పోల్ మేనేజ్‌మెంట్ ఆ తీర్పు స్వచ్ఛంగా వెలువడేలా చేసే వ్యవస్థాత్మక ప్రయత్నం. రాజకీయ పోటీ ఎంత తీవ్రమైనా ప్రజాస్వామ్య విలువలు, చట్టబద్ధ పరిమితులు, నైతిక బాధ్యతలు అన్నింటికంటే పైచేయి సాధించాలి. పట్టణ ప్రజల సంక్షేమం, సమగ్ర అభివృద్ధి, బాధ్యతాయుత పాలనఇవన్నీ ఓటు పెట్టే క్షణంలోనే రూపుదిద్దుకుంటాయి. అందుకే ప్రచారం ముగిసిన తర్వాతి ప్రతి క్షణం ప్రజాస్వామ్య పరిపక్వతకు అద్దం పడుతుంది. సమన్వయం, పారదర్శకత, నిబద్ధతతో సాగిన పోల్ మేనేజ్‌మెంట్ మున్సిపల్ పాలనకు బలమైన పునాది వేస్తుంది. ఇదే పట్టణ ప్రజాస్వామ్య విజయానికి అసలు కొలమానం.

# కోటిలింగాలలో శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లపై సమీక్ష




**చురకలు, విలేఖరి, వెల్గటూర్, ఫిబ్రవరి 9 :** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం కోటిలింగాల శ్రీ కోటేశ్వరస్వామి ఆలయం, గోదావరి పరిసరాల్లో ఈ నెల 15 న జరిగే మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని భక్తుల సౌఖర్యార్థం ముందస్తు ఏర్పాట్లకు గాను సోమవారం ఆలయ నిర్వాహకులు వివిధ శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. గోదావరి పుణ్యస్నానాలకు, కోటేశ్వరస్వామి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా,విద్యుత్,చలువ పందిళ్ళ,శానిటేషన్,పార్కింగ్, త్రాగునీరు, మజ్జిగప్యాకెట్ల పంపిణి,దుస్తువులు మార్చుకునే గదులు, గజ ఈతగాళ్ళు, పోలీస్ బందోబస్త్ తదితర చర్యలు తీసుకొనే విషయమై చర్చించారు. ఆలయ కార్య నిర్వాహకులు సంబంధిత అధికారులు సమన్వయంతో కలిసి ఉత్సవాలను విజయవంతం చేయాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో ఆలయ చైర్మన్ పూదరి రమేష్ తహశీల్దార్ ఆర్,శేఖర్,విద్యుత్ ఏఈ. శ్రీనివాస్,ఆలయ ఈ ఓ కాంత రెడ్డి, ఏ ఎస్ ఐ. శ్రీనివాస్, ఆర్ ఐ. రాంరెడ్డి,స్థానిక సర్పంచ్ కోటయ్య, ఉపసర్పంచ్ అడ్డగట్ల తిరుపతి, ధర్మకర్తలు రాపాక రాయకోటు, బుద్దె రవి, గుమ్ముల వెంకటేష్, గోనె రాజిరెడ్డి, మేరుగు శ్రీనివాస్, అర్చకులు నాగరాజు శర్మ, సంజీవ్ శర్మ, తదితరులు పాల్గొన్నారు.

# జగిత్యాల ఎంసిహెచ్‌లో అండాశయ కణితి తొలగింపు

**-4 గంటలు కష్టపడి ఆపరేషన్ చేసిన డాక్టర్లు**





**చురకలు విలేకరి, జగిత్యాల, ఫిబ్రవరి 9 :** సుమారు నాలుగు గంటలపాటు కస్టపడి అరుదైనా ఆపరేషన్ చేసి మహిళా కడుపులోని పెద్ద కణితిని తొలగించి ఆమెను ప్రాణాపాయం నుండి రక్షించారు. జగిత్యాల ప్రభుత్వ మాత,శిశు ఆసుపత్రి లోనీ ఓబీజీ వైద్యులు అరుణ, మాధవి లు 36వారాల గర్భిణీ పరిమాణనికి అనుగుణంగా ఉన్న ఎడమ అండాశం లో కణితితో ఉన్న 36 ఏళ్ల మహిళా కడుపులో ఉన్న పెద్ద కణితిని అన్వేషత్మాక లాపరోటమి ఆపరేషన్ చేసి తీసివేశారు.మునుపటి 3లోయర్ -సెగ్మెంట్ సిజెరియన్ విభాగాల చరిత్ర కలిగిన గ్రావిడ 3ఫారారోగి ఆసుపత్రిలో చేరగా ప్రభుత్వ డాక్టర్లు అరుణ,మాధవిలు ఎంతో కస్టపడి ఆమెకు ప్రాణాంత కశీగా ఉన్న కణితిని శస్త్రచికిత్స చేసి తొలగించి రోగినీ బ్రతికించిన సంఘటన పట్ల కుటుంబసభ్యులు, ఆసుపత్రి సిబ్బంది డాక్టర్లను అభినందించారు.కడుపులోంచి తొలగించిన కణితి నిర్ధారణ కోసం హిస్టోపాథాలాజికల్ పరీక్ష కోసం పంపించినట్లు డాక్టర్లు అరుణ, మాధవిలు తెలిపారు.

# ఘనంగా పిఆర్టియూటిఎస్ ఆవిర్భావ వేడుకలు



**చురకలు విలేకరి, జగిత్యాల, ఫిబ్రవరి 9 :** జగిత్యాల జిల్లా కేంద్రం లోని పిఆర్టియూ టిఎస్ కార్యాలయంలో 55వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిఆర్టియూ టిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు సామల యాదగిరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బోయిని పెల్లి ఆనంద్ రావు,యాల్ల అమర్నాథ్ రెడ్డి జెండా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సంక్షేమమే కాకుండా విద్యావ్యవస్థ బలోపేతం కోసం పిఆర్టి యూ కృషిచేసిందని,అదేవిధంగా ఉపాధ్యాయుల సంక్షేమం కోసం ఎన్నో జీవోలు సాధించిన ఘనత పిఆర్టియూ దేనన్నారు.ఉపాధ్యాయులు ఉమ్మడి సర్వీసు రూల్స్ గాని 010జీతాలు గాని,అప్రెంటిషిప్ రద్దుగాని అదేవిధంగా మహిళా ఉపాధ్యాయులకు స్పెషల్ క్యాజువల్స్ మెటర్నిటీ లీవ్స్ మరియు చైల్డ్ కేర్ లీవ్స్ ఇప్పించిన ఘనత పి ఆర్ టి యు దే అని వారన్నారు. సంఘానికి విశిష్ట సేవలు అందించి పదవి విరమణ పొందిన ఉపాధ్యాయులు చింతపండు నర్సింగం, మానేరు శంకరయ్య, జనార్దన్‌లను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఉపాధ్యాయ మాసపత్రిక సంపాదకవర్గ సభ్యులు అబ్దుల్ జమీల్, రాష్ట్ర, జిల్లా, మండల శాఖ బాధ్యులు పాల్గొన్నారు.

# ఆదర్శ విద్యాలయంలో ఆహార మహోత్సవం

**-హెడ్ బాయ్, హెడ్ గర్ల్ ప్రమాణ స్వీకారం**








**చురకలు, విలేఖరి, వెల్గటూర్, ఫిబ్రవరి 9 :** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం కుమ్మరిపల్లె ప్రభుత్వ ఆదర్శ విద్యా లయంలో సోమవారం ఆహార మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు తెలంగాణ పోషకాహార వంటకాలు వండి, వాటిని తినడం వలన ఎలాంటి పోషక ఉపయోగాలు లభిస్తాయో వివరించారు. విద్యార్థు లు తయారు చేసిన పోషకాహార పదార్థలను ముఖ్య అతిథిగా పాల్గొన్న స్థానిక తహశీల్దార్ శేఖర్, ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్ పరిశీలించి విద్యార్థులను అభినందించారు. ఈకార్యక్రమంలో భాగంగా క్రితం నిర్వహించిన స్కూల్ హెడ్ బాయ్, హెడ్ గర్ల్ ఎన్నికల్లో విజయం సాధించిన విద్యార్థులచే తహశీల్దార్ సమక్షంలో ప్రమాణ స్వీకారం చేయించారు. విద్యాలయాల్లో ఎన్నికలు నిర్వహించడం వల్ల ఎలక్షన్ నిర్వాహణ, ఓటు విలువ పట్ల విద్యార్థులకు అవగాహన కలుగుతుందని తహశీల్దార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# మునిసిపాలిటీలు అభివృద్ధి చెందాలంటే బిజెపిని గెలిపించాలి

**-ఇబ్రహింపట్నం మండల బిజెపి సీనియర్ నాయకులు గుజ్జె గంగాధర్**



**చురకలు,విలేఖరి,ఇబ్రహింపట్నం, ఫిబ్రవరి 9 :** మున్సిపాలిటీలు అభివృద్ధి చెందాలంటే బిజెపి కౌన్సిలర్లను గెలిపించాలని జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం మండల బిజెపి సినియర్ నాయకులు గుజ్జె గంగాధర్ అన్నారు.మెట్‌పల్లి మున్సిపాలిటీలోని 26వవార్డులో అభ్యర్ది బోడ్ల రమేష్‌ను గెలిపినకు ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ పట్టణాల అభివృద్ధికి మరియు గ్రామాల అభివృద్ధికి ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఆధ్వర్యంలో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు జరుగుతున్నాయని అందుకు కౌన్సిలర్లను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు.పలువురి ఓటర్లును కలిసి ఓట్లు అడిగారు.ఈకార్యక్రమంలో నాయకులు బోడ్ల గౌతమ్,బుర్రి నారయణ,వార్డుల సభ్యులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# కనక సోమేశ్వర కొండ కింద అన్నదానం



**చురకలు విలేకరి,మల్లాపూర్,ఫిబ్రవరి 9 :** మల్లాపూర్ మండల కేంద్రంలో ప్రసిద్ధి గాంచిన శ్రీ కనక సోమేశ్వర స్వామి కొండపైన భక్తులు సోమవారం అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ చిట్యాల లక్ష్మణ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి కొండ కింద భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఆసుపత్రిలో పండ్లు పంపిణీ



**చురకలు విలేకరి,మల్లాపూర్,ఫిబ్రవరి 9 :** మల్లాపూర్ మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలోని ఆరవ తరగతి విద్యార్థిని, విద్యార్థులు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సామాజిక సేవలో భాగంగా సోమవారం ఆసుపత్రిలోని రోగులతో వృద్ధులకు పంపిణి చేశారు.కాగా విద్యార్థుల సామాజిక సేవా దృక్పథానికి పలువురు అభినందించారు.ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి వాహిని,పాఠశాల ప్రిన్సిపల్ భూమేష్,తిరుపతి,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీ పట్టివేత



**చురకలు విలేకరి, ఇబ్రహీంపట్నం,ఫిబ్రవరి 9 :** ఏలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీ పట్టుకొని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఇబ్రహీపట్నం ఎస్ఐ నవీన్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఇబ్రహీంపట్నంలో ఇందిరాగాంధీ చౌరస్తా వద్ద సోమవారం ఉదయం గోదావరి నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని జిపివో సుంకం తిరుపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు, అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని సీజ్ చేసి, లారీ యాజమాని ఇస్లావత్ శంకర్, డ్రైవర్ భూక్య వంశీలపై కేసు నమోదు చేశామని ఎస్ఐ నవీన్ కుమార్ తెలిపారు.

# ప్రజలు నిర్భయంగా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలి

**-జగిత్యాల డిఎస్పీ రఘుచందర్**



**చురకలు ప్రతినిధి,జగిత్యాల, ఫిబ్రవరి 9 :** ఈనెల 11న జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు నిర్భయం గా తమ ఓటుహక్కును వినియోగించు కోవాలని జగిత్యాల డిఎస్పీ రఘుచందర్ అన్నారు.మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలనే లక్ష్యంతో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు సోమవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ ఫ్లాగ్ మార్చ్ను డిఎస్పి రఘు చందర్ ప్రారంభించగా,ఈ ఫ్లాగ్ మార్చ్ మంచి నీళ్ల బావి నుంచి ప్రారంభమై, తీన్‌ఖని, టవర్ సర్కిల్,న్యూ బస్‌స్టాండ్ ప్రాంతాల మీదుగా సాగింది.ఈ సందర్భంగా డిఎస్పి రఘుచందర్ మాట్లాడుతూ ఈనెల11వ తేదీన జరగనున్న మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ప్రజలంతా ఎలాంటి భయాందోళనలు లేకుండా పోలింగ్కు హాజరై తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించు కునే విధంగా అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగే విధంగా అన్ని విధాల చర్యలు తీసుకుంటున్నామన్నారు. మద్యం, నగదు లేదా ఇతర ప్రలోభాల ద్వారా ఓటర్లను ప్రభావితం చేయడానికి ఎవరైనా ప్రయత్నించినట్లు తమ దృష్టికి వస్తే, ఎన్నికల నియామావళి ప్రకారం



సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.అలాగే శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా ఎవరైనా ప్రవర్తించినట్లయితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ప్రజలు, రాజకీయ పార్టీలు, అభ్యర్థులు పోలీస్ శాఖకు సహకరించి ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు.ఈ ఫ్లాగ్ మార్చ్ ఇన్స్పెక్టర్ లు సుధాకర్,కరుణాకర్,ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఉత్తమ జీవన శైలితోనే విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు

**-వ్యక్తిత్వ వికాస నిపుణులు బుర్ర మధుసూదన్ రెడ్డి**





**చురకలు, విలేఖరి, వెల్గటూర్, ఫిబ్రవరి 9 :** ప్రతి విద్యార్థి ఉజ్వల భవిష్యత్తు ఆచరించే సమోన్నత జీవనశైలి పైనే ఆదారపడి ఉంటుందని ప్రముఖ రచయిత,కాలమిస్టు,విశ్రాంత ప్రిన్సిపల్,వ్యక్తిత్వ వికాస నిపుణు లు లయన్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధు సూదన్ రెడ్డి పేర్కొన్నారు.సోమవారం లీడ్ ఇండియా పౌండేషన్ ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం కుమ్మరి పల్లె మోడల్ స్కూల్ జూనియర్ కాలేజ్ లో ఏర్పాటు చేసిన పీఎం శ్రీ స్కూల్స్ ఎక్స్‌పర్ట్ టాక్,కెరీర్ గైడెన్స్ లో భాగంగా డాక్టర్ బి మధుసూదన్ రెడ్డి పాల్గొని మాట్లాడారు.పిల్లలు విద్యను నమ్ముకొని పేదరికాన్ని జయించి దేశాభివృద్ధికి పాటుపడాలని సూచించారు.విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలంటే ఇప్పటి నుండే మంచి అలవాట్లతో పాటు ఉత్తమ నడవడికను అలవర్చు కొని విద్యలో రాణించాలని తెలిపారు. ఉన్నత స్థాయిలో నిలబడాలంటే నేడు మనం చేస్తున్న స్మార్ట్ వర్క్ ఉపయోగ పడుతుందని దిశా నిర్దేశం చేశారు. ప్రతి ప్రయత్నంలో మన పూర్వపు ఫలితాలకు మించి ఉత్తమ ఫలితాలను సాధించడం ద్వారా అగ్ర స్థానాన్ని చేరవచ్చని తెలిపారు.మనం పరిశీలిస్తున్న ప్రతి అంశంపట్ల అవగాహన పెంచుకోవాలని,ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలన్నారు. దివ్యాంగులు అంజనారెడ్డి మాట్లాడుతూ తాను ప్రమాదంలో కాళ్లు కోల్పోయి వీల్ చైర్ కు పరిమిత మైనప్పటికీ మానసిక సంకల్ప బలంతో అనుకున్న లక్ష్యాలను సాధించానని తెలిపారు.లీడ్ ఇండియాబాధ్యులు రాష్ట్రస్థాయి శిక్షణ సమన్వయకర్త తాడూరి శ్రీనివాస్ ఆచార్య మాట్లాడుతూ ఒక మామూలు మనిషి మహా మనిషిగా ఎలా ఎదగ గలడో అనేక అంశాలను ఉదహరిస్తూ ఆచార్య విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఇందులో మాస్టర్ ట్రైనర్స్ శ్రీనివాస్ చిరంజీవి ఉపాధ్యాయులు పాల్గొని ముఖ్య అతిథిని ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా తను రచించిన పలు పుస్తకాలను ప్రిన్సిపల్ చేతుల మీదుగా లైబ్రరీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్,దీప, ఉపాధ్యాయులు, 400లకు పైగా విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# జగిత్యాల 46వ వార్డులో ఉద్రిక్తత

**-ఎన్నికల నియమావళి ఉల్లంఘనలపై చర్యలేవని ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష పార్టీ అభ్యర్థులు**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఫిబ్రవరి 9 :** జగిత్యాల పట్టణంలోని 46వ వార్డులో సోమవారం ఉద్రిక్తత చోటు చేసుకుంది. 46వ వార్డులో కాంగ్రెస్ పార్టీ నుండి కౌన్సిలర్ గా పోటీ చేస్తున్న ఫర్వీన్ సుల్తానా సిరాజోద్దీన్ మన్సూర్ నివాసం వద్ద మద్యం సీసాలు దించుతున్న క్రమంలో ఎంఐఎం కార్యకర్తలు అడ్డుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్న అనంతరం అభ్యర్థి ఇంట్లోకి వెళ్లి సోదాలు నిర్వహించక పోవడంపై ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులు విమర్శలు గుప్పిస్తున్నారు. అధికార పార్టీకి చెందిన అభ్యర్థి మద్యం దించుతున్న అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించారని పలువురు ఆరోపిస్తున్నారు. అయితే మద్యం సీసాలు దించుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ కాగా అందులో అధికార పార్టీ నాయకుడు సిరాజోద్దీన్ మన్సూర్ ఎవరితో ఏం కాదు... ఏమైనా నేను చూసుకుంటానని వ్యాఖ్యానించడం దుమారం రేపుతుంది. ఈ వ్యవహారం పట్ల ఎన్నికల అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సి ఉంది.

## శాంతియుత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

**-మెట్‌పల్లి డీఎస్పీ రాములు**




**చురకలు విలేకరి,మెట్‌పల్లి, ఫిబ్రవరి 9 :** ఎన్నికల నేపథ్యంలో కోరుట్ల నియోజకవర్గంలోని రెండు మున్సిపాలిటీ కోరుట్ల,మెట్‌పల్లి పట్టణాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు అన్ని రాజకీయ పార్టీలు,అభ్యర్థులు పూర్తిస్థాయిలో సహకరించాలని మెట్‌పల్లి డీఎస్పీ రాములు కోరారు.సోమవారం డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన కీలక సూచనలు చేశారు.ఈ నెల 11న జరగనున్న పోలింగ్ను దృష్టిలో ఉంచుకుని డీఎస్పీ పలు అంశాలను స్పష్టం చేశారు. ఎన్నికల ప్రచార సమయం ముగిసినందున, అభ్యర్థులు ఆయా పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు నిబంధనలను తూచ తప్పకుండా పాటించాలని, పోలింగ్ కేంద్రాల సమీపంలో ఓటర్లను అభ్యర్థించే క్రమంలో ఎలాంటి ఘర్షణలకు దిగకూడదని, అనవసర ఉద్రిక్తతలకు కారణమయ్యే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. ఎన్నికలు అనే ప్రజాస్వామ్య పండుగను ప్రశాంతంగా నిర్వహించుకోవడం మనందరి బాధ్యత కాబట్టి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని డీఎస్పీ రాములు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మెట్ పల్లి సీఐ అనిల్ కుమార్, ఎస్సై కిరణ్ కుమార్, కోరుట్ల ఎస్సై చిరంజీవి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్



**చురకలు విలేకరి,మెట్‌పల్లి, ఫిబ్రవరి 9 :** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో సోమవారం మెట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో రౌడీ,హిస్టరీ షీటర్లకు మెట్‌పల్లి సీఐ అనిల్ కుమార్ కౌన్సిలింగ్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు.ఎన్నికల నేపథ్యంలో రౌడీ, హిస్టరీ షీటర్లు ఏలాంటి సంఘటనలు,గొడవలకు పాల్పడిన చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మెట్ పల్లి ఎస్ఐ పి.కిరణ్ కుమార్, ఇబ్రహీంపట్నం ఎస్ఐ నవీన్ కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మండల రైతులు సద్వినియోగం చేసుకోవాలి




**చురకలు విలేఖరి వీణవంక,ఫిబ్రవరి 09 :** ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ లో సభ్యత్వం పొందడానికి వచ్చిన అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వీణవంక ప్రాథమిక వ్యవసాయ సహకార సంస్థ సీఈఓ చందుపట్ల ప్రకాశ్ రెడ్డి ప్రకటనలో పేర్కొన్నారు. వీణవంక సహకార సంస్థ ఎఫ్పీఓ (ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్) కు ఎంపిక కావడం జరిగిందని, ఈ సంస్థలో సభ్యత్వం కోసం రూ. 2 వేలు చెల్లించాలని అన్నారు. ఇందులో 750 మంది సభ్యులకు మాత్రమే అవకాశం ఉందని, కావున సొసైటీ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సంస్థలో సభ్యుల వ్యవసాయ అవసరాల నిమిత్తం వ్యవసాయ యాంత్రీకరణ పరికరాల కొనుగోలుతో పాటు సభ్యుల ఆర్థికాభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వంచే నిధులు మంజూరు చేయబడతాయని ఈ సందర్భంగా సీఈఓ ప్రకాశ్ రెడ్డి తెలియజేశారు.

# మహిళలకు షీ టీం పై అవగాహన ఉండాలి



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ ఫిబ్రవరి 9 :** మహిళలకు షీటీం పై అవగాహన ఉండాలి అని షీటీం ఇన్చార్జి స్నేహలత అన్నారు.రామగుండం సి.పి ఆదేశాల మేరకు,షీ టీమ్ ఇంచార్జి ఎస్సై లావణ్య ఆధ్వర్యంలో,ఎన్ టిపిసి శాలపల్లిలోని అకాడమిక్ హెయిట్స్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులకు షీ టీం అవగాహన సదస్సు నిర్వహించడం జరిగినది.అందులో భాగంగా షీటీం మెంబర్ స్నేహలత మాట్లాడుతూ మహిళల భద్రత మరియు ఆన్లైన్ మోసాలపై మరియు యాంటీ డ్రగ్స్,ఎవరైనా చెడుగా మాట్లాడిన, ప్రవర్తించిన తల్లిదండ్రులకు చెప్పాలని, మరియు వాటి నుంచి ఎలా బయట పడటంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహిళల రక్షణ కోసం ప్రతి రోజు బస్టాండ్ మరియు ప్రధాన చౌరస్తాలో జన సమీకరణ ప్రాంతాల్లో కాలేజీల వద్ద షీ టీం నిరంతరంగా ఉంచడం జరుగుతుందని,ఎవరైనా వేధింపులకు గురి చేస్తే మహిళలు విద్యార్థులు భయపడకుండా 6303923700 నంబర్‌కు ఫోన్ చేసి సమస్య తెలపాలని కోరారు.ఫోన్ చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని స్పష్టం చేశారు.అలాగే అత్యాశకు పోయి సైబర్ క్రైమ్ ఆన్లైన్ మోసాలు,లోన్ యాప్స్ గురవుతున్నారని వాటికి జోలికి పోకుండా ఉండాలని, ఎవరైనా ఆన్లైన్ మోసాలకు గురైతే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కి సమాచారం ఇవ్వాలని, అలాగే మహిళలకు ఏదైనా ప్రమాదం ఉన్నట్లయితే, బెదిరింపులకు గురైతే వెంటనే 100 నంబర్ కు డయల్ చేయాలని, సోషల్ మీడియా ప్రభావం వలన జరిగే ఇన్సిడెన్స్ గురించి, తల్లి దండ్రులు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి తెలిపారు. గుడ్ టచ్ బాడ్ టచ్ గురించి, మరియు టీన్ ఏజ్ లో ఎలా ఉండాలి అని తెలిపారు. ఈ కార్యక్రమం లో షీ టీమ్ సభ్యులు మౌనిక, సురేష్, డైరెక్టర్స్ శ్రీధర్ మరియు లావణ్య మరియు ప్రిన్సిపాల్ ఆయేషా మరియు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ గూటికి బీఆర్ఎస్ నాయకులు



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ ఫిబ్రవరి 9 :**

మంత్రి సమక్షంలో చేరిన మాజీ ఎంపీపీ మాదాడి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎక్కేటి అనంతరెడ్డి. బిఆర్ఎస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకులు మాజీ ఎంపీపీ మదాడి శ్రీనివాస్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎక్కేటి అనంత రెడ్డి కాంగ్రెస్ పార్టీ లో చేరారు. మంత్రి శ్రీధర్ బాబు వారికీ కాంగ్రెస్ కండువా కప్పి కాంగ్రెస్ పార్టీ లోకి ఆహ్వానించారు. వారితో పాటు రెడ్డి సంఘము మాజీ అధ్యక్షులు ఎంఎస్ రెడ్డి,రామడుగు మారుతీ, రాదంటి శంకర్ మంత్రి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.ఈ సందర్భం గా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ సీనియర్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరడం చాలా సంతోష కరమన్నారు. మంథని పట్టణం తో పాటు మంథని నియోజకవర్గం అభివృద్ధి కోరకు వారు ముందుకు రావడం.పేద బడుగు బలహీన, మైనారిటీ వర్గాల అభివృద్ధి కొరకు వారి అనుభవంతో పాటు సలహాలు సూచనలు కుడా తీసుకుంటూ..రానున్న రోజుల్లో రాష్ట్ర పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో పార్టీని బలోపేతం చేసే దిశగా ముందుకు వెళ్ళతామన్నారు.

# ఘనంగా డాక్టర్ జి సత్యనారాయణస్వామి జన్మదిన వేడుకలు

**-జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రజాప్రతినిధులు వివిధ పార్టీల నాయకులు**



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఫిబ్రవరి 09 :** ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని అశ్విని హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జి సత్యనారాయణ స్వామి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా కేక్ కట్ చేసి తినిపించి శాలువాలు కప్పి డాక్టర్ జి సత్యనారాయణ స్వామికి జన్మదిన శు భాకాంక్షలు తెలిపారు.నిండు నూరేళ్లు మరెన్నో జన్మదినోత్సవాలు జరుపు కోవాలని వారు ఆకాంక్షించారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలోసర్పంచ్ల ఫోరం అధ్యక్షులు దొమ్మాటి నరసయ్య,, సర్పంచ్‌లు ఎలగందుల నర్సింహులు సిర్రం నాగరాజు యాదవ్,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రామ్‌రెడ్డి,ఉప సర్పంచ్ బందారపు బాల్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బండారి బాల్ రెడ్డి,నారాయణపూర్ ఉప సర్పంచ్ మధుసూదన్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మెండే శ్రీను,వెంకటేష్ మూర్తి,తదితరులు పాల్గొని సత్యనారాయణ స్వామి కి జన్మదిన శు భాకాంక్షలు తెలిపారు.

# తల్లిదండ్రుల దినోత్సవ వైభవం




**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ ఫిబ్రవరి 9 :** పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం, ఘన్ శ్యాందాస్ నగర్ గ్రామపంచాయితీ పరిధిలోని ప్రముఖ పాఠశాల అయిన యూనివర్సల్ ఐ.ఐ.టి.ఫౌండేషన్ హైస్కూల్లో సోమవారం రోజున "తల్లిదండ్రుల దినోత్సవం" (పేరెంట్స్ డే) వేడుక ఘనంగా జరపడమైనది. కార్యక్రమంలో భాగంగా 10.వతరగతి విద్యార్థులు వారి తల్లిదండ్రలను స్టేజీ పైకి ఆహ్వానించి కూర్చోబెట్టి,శాలువా కప్పి, పాదాభి వందనం చేసి,వారి చేతుల మీదుగా మెమొంటోను స్వీకరించారు. విద్యార్థులు తమ ఉపన్యాసాలు, నృత్యాలు,పాటలతో పాటు డ్రామా స్కిట్స్‌తో అందరి హృదయాలను కదలించారు.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మహమ్మద్ ఇస్మాయిల్ మరియు ప్రధానోపాధ్యాయులు సయ్యద్ అఫ్జల్ మాట్లాడుతూ తల్లిదండ్రలు తమ పిల్లల కోసం ఎటువంటి త్యాగమైనా చేస్తారనీ, వారు శిరస్సు ఎత్తుకుని గర్వంగా పిల్లల గొప్పతనాన్ని చెప్పుకునేలా లక్ష్యం వైపు అడుగులు వేయాలని విద్యార్థుల భాద్యత లను వివరించారు.పాఠశాల ప్రాంగణ మంతా కరుణరసం జాలువారి, అందరి హృదయాలు ఆర్ధ్రంగా మారాయి.

## అ"పూర్వ" విద్యార్థుల సమ్మేళనం



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్,ఫిబ్రవరి 9 :** కమాన్‌పూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వం ఉన్నత పాఠశాలలో 2002-03 విద్యా సంవత్సరంలో పదోవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆదివారం స్థానిక 'కే ఎన్ " ఫంక్షన్ హాల్లో ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా అలనాడు విద్యా బోధన చేసిన గురువులకు శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు.అలాగే ప్రతి సంవత్సరం పూర్వ విద్యార్థులంతా కలిసి ఆత్మీయ సమ్మేళనాన్ని జరుపుకోవాలని నిర్ణయించారు.ఈ కార్యక్రమంలో గురువులు పూర్వ విద్యార్థులు ఉపాధ్యాయులు అయిన.నాగేశ్వరరావు,రామ్ రెడ్డి,కృష్ణ,అంజయ్య,హరి ప్రసాద్‌లకు విద్యార్థులు పాదాభివందనాలు చేసి సన్మానం చేశారు.ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్,నరేష్ , సురేష్,ఆదివారహల్ స్వామి,విజయ్,సతీష్,కడిపల్లి సుమన్,అందే శ్వేత, స్వప్న, నవ్యత,నసీమా,కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.


## ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌ను కలిసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఫిబ్రవరి 09 :** సిరిసిల్ల పట్టణంలోని సిరిసిల్ల శాసనసభ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కేకే మహేందర్రెడ్డి కార్యాలయానికి సిరిసిల్ల మున్సిపాలిటీ ఎన్నికల సందర్భంగా ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ రాగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతతో సన్మానించారు.ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ ఏఎంసీ చైర్మన్ షేక్ సాబేర బేగం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు షేక్ గౌస్ భాయ్, హరిదాస్ నగర్ సర్పంచ్ చిర్రం నాగరాజు యాదవ్‌లతో పాటు అక్కడున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా అద్దంకి దయాకర్ ను సన్మానించారు.అక్కడ సిరిసిల్ల శాసనసభ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కేకే మహేందర్ రెడ్డితో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు కనిమోని చక్రాధర్ రెడ్డి పట్టణ అధ్యక్షులు చొప్పదండి ప్రకాష్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వంగ మల్లారెడ్డి ,బండారి బాల్రెడ్డి,తిరుపతి రెడ్డి శ్రీకాంత్ రెడ్డి షకిల్ తదితరులు ఉన్నారు.

## కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించండి

**-ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు నలమాసు ప్రభాకర్**



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ ఫిబ్రవరి 9 :** మంథని మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు నలమాసు ప్రభాకర్ సోమవారం ఒక ప్రకటన కోరారు.మంథని మున్సిపల్ పరిధిలోని 13 వార్డుల్లో పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి మంథని అభివృద్ధి కోసం కృషి చేస్తున్న మంత్రి దుద్దిల శ్రీధర్ బాబు నాయకత్వాన్ని బలపరచాలని ఆయన సూచించారు. మంథని పట్టణం అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఆయన పేర్కొన్నారు. ఆర్యవైశ్య సంగం నాయకులు కుల బాంధవులు ఉన్నారు.

# బిఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల పరిపాలన వల్ల హామీల జాప్యం వాస్తవమే

**-బతుకమ్మ చీరల పేరిట మహిళల చేనేత కార్మికుల ఆత్మ గౌరవాన్ని దెబ్బ తీసింది కెసిఆర్ కేటీఆరే**

**-గృహ జ్యోతి పథకం ద్వారా మహిళల సోదరీమణులకు 2500 పెన్షన్ ఇచ్చుడే**

**-అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లను గెలిపించాలి**

**-సిరిసిల్ల శాసనసభ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి**



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఫిబ్రవరి 09 :** గత బిఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో చేసిన అస్థవ్యస్థమైన పరిపాలన వల్ల తెలంగాణ రాష్ట్రం వేల కోట్లల్లో అప్పుల పాలయ్యి ఇంకా కోలుకోలేక పోతుందని దీంతో హామీల అమలులో జాప్యం జరుగుతున్నమాట వాస్తవమేనని ఓటర్లు అడిగిన ప్రశ్నలకు పై విధంగా సిరిసిల్ల శాసనసభ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి ఓపికగా సమాధానం ఇచ్చారు. సిరిసిల్ల మున్సిపాలిటీలోని ఆరు ఏడు ఎనిమిది తొమ్మిది వార్డులలో జరిగిన ఎన్నికల ప్రచారంలో కేకే మహేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులతో కలిసి పాల్గొని ఆయన ప్రసంగించారు.తెలంగాణ రాష్ట్ర గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ ఒక లక్ష 116 రూపాయలతో పాటు తులం బంగారం కూడా ఇస్తామని అనుకోవడం జరిగింది కాని రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగు లేకపోవడంతో పాటు తులం బంగారం 1,80,000 రూపాయలకు పెరగడం వల్ల అది ఇవ్వడం సాధ్యం కాలేదన్నారు.ఈ విషయం మనందరికీ తెలుసునని ఈ సందర్భంగా ఆయన అనడంతో ఆ మాట నిజమేకదా అన్నట్లు,,,,,ఓటర్లు ఎవరికి వారుగా నవ్వుకోవడం కనిపించింది,కెసిఆర్ కేటీఆర్ బతుకమ్మ చీరల పేరిట రాష్ట్రంలో మహిళలతో పాటు చేనేత కార్మికుల ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసి లక్షల కోట్ల రూపాయలు అక్రమంగా దోసుకొని దాసుకొని తింటున్నారని అట్టి డబ్బును మునిసిపల్ ఎన్నికల్లో ఒక్క ఓటుకు రెండు మూడు వేల రూపాయలు ఇచ్చి బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లను గెలిపించుకోవాలని మీ వద్దకు అట్టి డబ్బులతో పాటు మద్యం తీసుకొని మీ వద్దకు వస్తారని అవి మన డబ్బే తీసుకొని చేతి గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థుల ను గెలిపించి బిఆర్ఎస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలని ఆయన విజ్ఞప్తి చేశారు, 10 ఏళ్లలో బిఆర్ఎస్ పార్టీ చేనేత కార్మికులకు మూడు కోట్ల 50 లక్షల రూపాయలు అప్పులు చేసి పెడితే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని చెల్లించడం జరిగిందన్నారు,చేనేత కార్మికులకు పని కల్పించడం కోసం ఇందిరమ్మ చీరల నేత పని ఇవ్వడం జరిగిందన్నారు.సీఎం రేవంత్ రెడ్డి మహిళల ఆత్మగౌరవం ప్రతికగా నిలిచే విధంగా ఇందిరమ్మ చీరలను పంపిణి చేయడం జరిగిందన్నారు.10 ఏళ్లలో ఒక్కటి కూడా రేషన్ కార్డు బిఆర్ఎస్ ప్రభుత్వం ఇవ్వలేదని కాంగ్రెస్ రేవంత్ రెడ్డి సర్కార్ రెండు సంవత్సరాల కాలంలో రేషన్కార్డు లేని వారందరికీ రేషన్ కార్డులు ఇస్తుందని ఇండ్లులేని నిరుపేదలకు సిరిసిల్ల మునిసిపాలిటీ లో 900ఇందిరమ్మ ఇల్లు ఇవ్వడం జరిగిందని రెండవ విడుత మరో తొమ్మిది వందల ఇందిరమ్మ ఇల్లు ఇల్లు లేని నిరుపేదలకు ఇప్పిస్తామని అది కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఆయన గుర్తు చేశారు.రాష్ట్రంలో అప్పుల పాలై ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన ప్పటికీ సీఎం రేవంత్ రెడ్డి ఒకవైపు అభివృద్ధి మరోవైపు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని అది ఆయనతోనే సాధ్యమని అన్నార ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చి తీరుతామని మడమ తిప్పేది లేదు మాట తప్పేది లేదన్నారు.కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి ఉన్నారని ఆయన గుర్తు చేశారు.ఎన్నికల సమయంలో వాడు వీడు వచ్చి వాడికి వీడికి ఓటు వేయాలని ఏమోమో చెబుతారు వాడీ వీడీ మాటలు విని మోసపోకుండా పదేళ్ల బిఆర్ఎస్ కెసిఆర్ ప్రభుత్వం చేపట్టిన పనులను సీఎం రేవంత్రెడ్డి ప్రభుత్వం రెండేళ్లలో చేపట్టిన పనులను చూసి ఆలోచించి కాంగ్రెస్పార్టీ అధికారంలో ఉన్నది కాబట్టి మరింత అభివృద్ధి జరగాలంటే అది కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంతోనే సాధ్యం కాబట్టి మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్పార్టీకౌన్సిలర్ అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ ఎన్నికల ప్రచార కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు చొప్పదండి ప్రకాష్,జిల్లా గ్రంథాలయాల చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, ఏఎంసీ చైర్మన్ షేక్ సాబేరా బేగం, కాంగ్రెస్ పార్టీ నాయకులు గడ్డం నరసయ్య వైద్య శివప్రసాద్ ,షేక్ గౌస్ బాయ్,బొప్పా దేవయ్య,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి ఎల్లారెడ్డిపేట మాజీ సర్పంచ్ నేవూరి వెంకట్ రెడ్డి,గుండాడి రాంరెడ్డి,బండారి బాల్రెడ్డి మెండే శ్రీనివాస్ యాదవ్, పొన్నాల బాలకిషన్ గౌడు,వంగ శ్రీకాంత్ రెడ్డి షకిల్ ఆయా వార్డుల కాంగ్రెస్ పార్టీ మహిళానాయకులు కాంగ్రెస్ పార్టీనాయకులు కార్యకర్తలు ఓటర్లు పాల్గొన్నారు.

# నూతన సేవా అధ్యక్షురాలికి స్వాగతం పలికిన సేవా సభ్యులు



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ ఫిబ్రవరి 9 :** రామగిరి మండలం సెంటినరీకాలనీ సేవా భవన్ నందు సోమవారం నిర్వహించిన కార్యక్రమం లో రామగుండం-3,అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా సేవా అధ్యక్షురాలిగా నూతనం గా విచ్చేసిన శ్రీమతి ఎస్.తిరుమల మధుసూదన్ని అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ సతీమణి శ్రీమతి కే.వెంకటలక్ష్మి నాగేశ్వరరావు, సేవా సభ్యులు పుష్పగుచ్చాన్ని అందజేసి, శాలువాతో సత్కరించి స్వాగతించారు. సేవా సభ్యులందరూ తమను పరిచయం చేసుకుని తాము నేర్చుకున్న వృత్తి విద్యల గురించి, పొందుతున్న స్వయం ఉపాధి గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా నూతన సేవా అధ్యక్షురాలు తిరుమల మధుసూదన్ మాట్లాడుతూ ఇంత మంచి అవకాశం వేరే కంపెనీల లో ఉండదని,చక్కగా మహిళలు నిరుద్యోగ యువత జీవనోపాధి పొంది కుటుంబానికి ఆర్దిక చేయూత అందించే వృత్తి శిక్షణలు సింగరేణి సేవాసమితి తోనే సాధ్యం.మీరు చాలా రకాల వృత్తులు నేర్చుకున్నారని తెలిసి ఆనందంగా ఉందని అన్నారు.అయితే నేర్చుకున్న శిక్షణ వినియోగించి ఆర్థికంగా కుటుంబానికి సహకరించిన పుడే ఫలితం ఉంటుంది. మీరందరూ సొంత యూనిట్లు నెలకొల్పుకుని సంపాదిస్తూ నలుగురికి ఉపాధి కల్పించవలసిందిగా కోరుకుంటున్ననని అన్నారు.ఈ కార్యక్రమంలో పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, డివైపియం సునీల్ ప్రసాద్, కోఆర్డినేటింగ్ ఆఫీసర్ పి.రాజేశం, సేవా కార్యదర్శి ఉమాదేవి, సంయుక్త కార్యదర్శి అరుణ, సేవా సభ్యులు పాల్గొన్నారు.

# మహాశివరాత్రి ఉత్సవాలకు జిఎంకు ఆహ్వానం



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ (రామగిరి) ఫిబ్రవరి 9 :** రామగిరి మండలం కల్వచర్ల ఉమామహేశ్వర ఆలయంలో జరిగే శివరాత్రి ఉత్సవాలకు హాజరుకావాలని ఆహ్వాన పత్రాన్ని ఆర్జిత జి ఎం సుంకర మధుసూదన్కు అందజేశారు.కల్వచర్లలో గ్రామంలో శ్రీ ఉమామహేశ్వర స్వామి ఆలయంలో జరిగే మహాశివరాత్రి ఉత్సవానికి ఆర్ జి 3 మధుసూదన్ ని మర్యాదపూర్వకంగా ఆహ్వానించడం జరిగింది.ఇందుకుగాను అత్యంత భక్తి శ్రద్ధలతో ఆలయాల అభివృద్ధి కోసం కృషి చేస్తున్న సర్పంచ్ మరియు ఆలయ కమిటీ చైర్మన్ రేండ్ల శారద కుమారస్వామి ని అభినందించారు.

## ఛత్రపతి మహారాజ్ విగ్రహ నిర్మాణానికి మాజీ సర్పంచ్ నేవూరి విరాళం



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఫిబ్రవరి 09 :** రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో నిర్మించ తలపెట్టిన చత్రపతి మహారాజు విగ్రహ నిర్మాణానికి మండలంలోని యూత్ సంఘాలు ఏకమై మండల కేంద్రంలో శివాజీ విగ్రహానికి శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ నేవూరి వెంకటరెడ్డి తన వంతు సహాయంగా 1.51000 రూపాయలు విరాళంగా ప్రకటించి పలువురికి ఆదర్శంగా నిలిచారు.సోమవారం తన నివాసంలో చత్రపతి శివరాజ్ మహారాజు విగ్రహ పోస్టర్ను యూత్ సభ్యులతో కలిసి వెంకట్ రెడ్డి ఆవిష్కరించారు.అనంతరం మాజీ సర్పంచ్ నేవూరి వెంకట్రెడ్డి మాట్లాడుతూ చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ సాధన కార్యక్రమానికి పూర్తి మద్దతు, సహకారం ఉంటుందని అన్నారు.ఈ సందర్భంగా యూత్ సభ్యులు వెంకట్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ద్యాగం నారాయణ ,పోరెడ్డి శ్రీనివాస్ రెడ్డి,అఫ్జల్,యమగోండ పద్మా రెడ్డి,ఏర్పుల శ్రీనివాస్ జర్నలిస్ట్ పెంటం శ్రీనివాస్, వివిధ సంఘాల యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## 16వ వార్డులో "మారేపల్లి సుశీల" ప్రభంజనం



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ ఫిబ్రవరి 9 :** హుజురాబాద్ మున్సిపాలిటీ 16వ వార్డులో బిఆర్ఎస్ అభ్యర్థి మారేపల్లి సుశీల ముందంజలో ఉన్నట్టు తెలుస్తోంది. సుశీల గతంలో రెండుసార్లు కౌన్సిలర్గా గెలిచి ప్రజాభిమానాన్ని గెలుచుకుంది. ఆమెకు దళిత వర్గాల్లో బడుగు బలహీన వర్గాల్లో మంచి పేరుంది. ఆమె భర్త సంజీవరావు విద్యుత్ శాఖలో పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. అత్యంత సౌమ్యురాలిగా వివాదరహితురాలిగా ఆమెకు పేరు ఉంది.గతంలో ఆమె ఎన్నో అభివృద్ధి పనులు చేశారు.బడుగు బలహీన వర్గాలతో ఆమె మమేకమై పనిచేస్తారని పేరు ఉంది.ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ప్రోత్సాహంతో ఆమె మరోసారి బరిలో నిలిచారు.మామిండ్ల వాడలో ఉన్న ఎస్సీ ఎస్టీ బిసి మైనారిటీ ఓటర్లు ఆమెకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నారు.ఇటీవల ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఆమె వార్డులో పర్యటించి సుశీలను గెలిపించాలని కోరారు.గత పది రోజులుగా సుశీల వార్డులో పార్టీ కార్యకర్తలు నాయకులు ప్రజలతో మహిళలతో చేసిన ప్రచారానికి మంచి స్పందన లభించింది.ఆమె గెలుపు బాటలో ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది.

## కర్ణాటక క్యాంప్కి ఎంపికైన యువకుడు దూలం సురేష్



**చురకలు విలేఖరి వీణవంక ఫిబ్రవరి 09 :** భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు క్రీడల మంత్రిత్వ శాఖ, మై భారత్ కర్ణాటక రాష్ట్రం మంగుళూరు లో ఈ నెల 12 నుండి 16 వరకు వారం రోజులు పాటు జరిగే క్యాంప్ కి తెలంగాణ రాష్ట్రం పలువురు ఎంపిక కాగా కరీంనగర్ జిల్లా వీణవంక మండలం మల్లారెడ్డిపల్లి గ్రామనికి చెందిన దూలం సురేష్ ఎంపికైనట్లు అలాగే ఈ క్యాంప్ కి జిల్లా నుండి ప్రాతినిధ్యం వహించనున్నట్లు ఉమ్మడి కరీంనగర్ జిల్లా యువ అధికారి ఎం.వెంకట రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు.సురేష్ ఎంపిక పట్ల మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ సందర్భంగా సురేష్ ను యువజన సంఘం అధ్యక్షుడు కర్రే నాని,దూలం నరేష్,తో పాటు యూత్ సభ్యులు పలువురు అధికారులు నాయకులు అభినందించారు.

# పారిశుధ్య పనులు పకడ్బందీగా చేయాలి

**-ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్**
**-మహా శివరాత్రి జాతర నేపథ్యంలో పంచాయతీ కార్యదర్శులు, వేములవాడ మున్సిపల్,శ్రీ రాజ రాజేశ్వర స్వామి ఆలయ అధికారులతో సమీక్ష**



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డి పేట ఫిబ్రవరి 09 :** మహా శివరాత్రి జాతర సందర్భంగా వేములవాడలో పారిశుధ్య పనులు పకడ్బందీగా చేయాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.మహా శివరాత్రి జాతర సందర్భంగా వేములవాడను పలు జోన్లుగా పారిశుధ్య పనుల నిర్వహణకు వేములవాడ మున్సిపల్,శ్రీ రాజ రాజేశ్వర స్వామి ఆలయ అధికారులు.. జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులకు ఇంచార్జి బాధ్యతలు అప్పగించి.. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం లో సోమవారం అవగాహన,శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించగా,ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై మాట్లాడారు.ఈ నెల 14వ తేదీ నుంచి 16 వ తేదీ వరకు వేములవాడలో మహా శివరాత్రి జాతర సందర్భంగా వేములవాడ పట్టణాన్ని 20 జోన్లుగా విభజించి ప్రతి జోనుకు ఒక పంచాయతీ కార్యదర్శిని ఇంచార్జిగా బాధ్యతలు అప్పగించి..వారికి సిబ్బంది, శానిటేషన్ పరికరాలు ఇస్తామని తెలిపారు.వీరు అందరూ ఈ నెల13వ తేదీ నుంచి 17వ తేదీ వరకు వేములవాడలో సేవలు అందించాలని సూచించారు.పార్కింగ్,ఇతర ప్రాంతాల్లో చెత్తాచెదారం నిలువ ఉండకుండా చూడాలని ఆదేశించారు. జాతర ప్రదేశాల్లో స్వచ్ఛంగా.. పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని తెలిపారు.పారిశుధ్య పనులు చాలా కీలకమని,అందరూ సమన్వయం చేసుకోవాలని పిలుపు ఇచ్చారు. కార్యక్రమంలో డీఆర్డీఓ గీత, డీపీఓ షరీఫుద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

# కట్టుదిట్టమైన భద్రతల మధ్య స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలు

**-పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి**



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ (గోదావరిఖని) ఫిబ్రవరి 9 :** పెద్దపల్లి జిల్లాలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణ తో పాటు అనంతర కార్యక్రమాలకు సంబంధించిన అవసర చర్యలు చేపట్టు తున్నామని పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి తెలిపారు.సరస్వతి శిశు మందిర్ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేస్తున్న రిసెప్షన్,డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్,కౌంటింగ్ కేంద్రాల ను డీసీపీ,గోదావరిఖని ఏసిపి ఎం. రమేష్,గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా డీసీపీ అక్కడి ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేస్తూ,మరింత పక్డబందీగా ఏర్పాటు చేయాలని సూచనలు అందించారు. బ్యాలెట్ బాక్సుల డిస్ట్రిబ్యూషన్‌లతో పాటు, పోలింగ్ అనంతరం స్ట్రాంగ్ రూమ్‌లో వాటి భద్రత,సీసీ కెమెరాల ఏర్పాటు,ఆర్మ్ గార్డులు,సైన్ ఫ్లెక్సీలు, కౌంటింగ్ సమయంలో ఎవరికీ అను మతి ఇవ్వాలి,తీసుకోవలసిన జాగ్రత్తలు ,పార్కింగ్ అంశాలపై చర్చించారు. ఏర్పాట్ల విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించవద్దని, ఏమైె నా అనుమానాలు ఉంటే నేరుగా తనను సంప్రదించాలని సిబ్బందికి సూచించారు.

# కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే పెద్దపల్లి పట్టణం అభివృద్ధి

**-ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నాం**
**- పెద్దపల్లి మున్సిపల్పై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం**
**-త్వరలో పెద్దపల్లిలో ఐటీ పార్కు,ఆటోనగర్ ఏర్పాటు**
**- రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు**

**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ (పెద్దపల్లి) ఫిబ్రవరి 9 :** అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితిని గాడిలో పెడుతూ..పట్టణాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు, రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తేనే పట్టణాలు మరింత అభివృద్ధి చెందుతాయని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు.పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని జెండా చౌరస్తా వద్ద మున్సిపల్ ఎన్నికల ప్రచార కార్యక్రమం లో భాగంగా సోమవారం నిర్వహించిన యుద్ధ భేరి సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుతోపాటు అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. గూడులేని నిరు పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి ఆశ్రయం కల్పించి నట్లు పేర్కొన్నారు.నిరుపేదలకు త్వరలోనే ఇంటి స్థలాలను కేటాయించి గేటెడ్ కమ్యూనిటీ కాలనీ ఏర్పాటుకు చర్యలు చేపట్టామన్నారు.పెద్దపల్లి జిల్లా కేంద్రంలో త్వరలోనే ఐటీ పార్కు ఏర్పాటు చేయబోతున్నట్లు,ఆటో కార్మికుల కోసం ఆటోనగర్ నిర్మాణానికి స్థల సేకరణ కూడా చేస్తున్నామని ప్రకటించారు.పెద్దపల్లి నియోజకవర్గంలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించారు.రాష్ట్రంలో సీఎంఆర్ఎఫ్ మంజూరులో పెద్దపల్లి అగ్ర స్థానంలో నిలిచిందని,అందుకు స్థానిక ఎమ్మెల్యే విజయరమణారావు కృషి ఫలితమేనన్నారు.రూ.కోటితో జిల్లా కేంద్రంలో అంబేద్కర్ స్టడీ కోచింగ్ సెంటర్ భవన నిర్మాణం.అత్యాధునిక ఎ కర్యాలతో జిల్లా గ్రంథాలయ భవన నిర్మాణ పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.పేద విద్యార్థులకు ఉన్నత చదువుల కోసం కోచింగ్ సెంటర్



ఏర్పాటు చేస్తామన్నారు.అర్హులైన రైతులందరికి రూ.2లక్షల రుణ మాఫీ అందించామని,సన్నవడ్లకు రూ.500 బోనస్ చెల్లించిన ఘనత కాంగ్రెస్ సర్కారుదేనన్నారు.పెద్దపల్లి మున్సిపాలి టీపై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని గుర్తించి పెద్దపల్లి పట్టణ ప్రజలు అన్ని వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులను భారీమెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎమ్మెల్యే వి జయరమణారావు మాట్లాడుతూ పెద్దపల్లి పట్టణాభివృద్ధికి రూ.92 కోట్లు మంజూరు చేయించి అభివృద్ధి పనులను ప్రారంభించినట్లు తెలిపారు.మరో రూ.22కోట్లు మంజూరు చెయించా మని గుర్తు చేశారు.అభివృద్ధి సంక్షేమాన్ని జోడెద్దుల్లా పరిగెత్తిస్తున్నట్లు వివరించారు.పెద్దపల్లి మున్సిపాలిటీలో 36 మంది కాంగ్రెస్ అభ్యర్థులను కౌన్సిలర్లుగా గెలిపించే బాధ్యత ప్రజలదేనని,పట్టణాభివృద్ధి బాధ్యత తాను తీసుకుంటానని ఎమ్మెల్యే ప్రకటించారు.రాష్ట్ర ప్రభుత్వం నుంచి పెద్దపల్లి నియోజకవర్గానికి నిధుల ప్రవాహాన్ని తెప్పిస్తానని చెప్పారు. ఎమ్మెల్సీ భానుప్రసాద్రావు మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థులు గెలిచిన వెంటనే పారదర్శకంగా జవాబుదారితనంతో ప్రజలకు సేవచేసి గుర్తింపు పొందాలని సూచించారు.పట్టణాభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు.ఈకార్యక్రమంలో పెద్దపల్లి ఎన్నికల ఇన్చార్జి బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి,ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


## మృతురాలు కుటుంబానికి ఆపన్న హస్తం



**చురకలు,విలేఖరి,వెల్గటూర్,ఫిబ్రవరి 9 :** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండల కేంద్రం నిరుపేద కుటుంబానికి చెందిన రేగుంట రాజమ్మ అనారోగ్యంతో మృతి చెందగా ఆమె కుటుంబానికి స్థానిక శ్రీ ఆంజనేయ ఆలయ కమిటీచైర్మన్ మెరుగు నరేష్‌గౌడ్ 50కిలోల బియ్యం ను ఆదివారం అందజేసి మానవ త్వం చాటుకున్నారు.గతంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు చేశామని,రాబోయే రోజుల్లో కూడా ఇలాంటి తనకు తోచిన సహాయ సహకారాలు పేద కుటుంబాలకు అందజేస్థానని నరేష్ తెలిపారు.వెల్గటూర్ లో స్వచ్చంద సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో బండమీది గోపి,వార్డ్ సభ్యులు ఎనగందుల నరేష్,రంగు మారుతీ,గుమ్ముల వెంకటేష్,గోపతి నరేష్,రేగుంట నర్సయ్య,సిరిపురం కృష్ణ,మూగల శేఖర్, రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

## స్విమ్మింగ్ పోటీల్లో మోడల్ స్కూల్ విద్యార్థికి గోల్డ్ మెడల్

**-ముగిసిన సీఎం కప్2025 జిల్లా స్థాయి స్విమ్మింగ్ పోటీలు**



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ ఫిబ్రవరి 9 :** గోదావరిఖని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో సోమవారం జిల్లా స్థాయి సీఎం కప్2025 స్విమ్మింగ్ పోటీలు విజయవంతంగా ముగిశాయి.అంతర్గాం జెడ్పీహెచ్ఎస్ పీడీ శోభారాణి, స్విమ్మింగ్ కోచ్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో పోటీలు సజావుగా సాగాయి.ఈ పోటీల కు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి మొత్తం 30 మంది క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. రామగుండం లోని లింగాపూర్ ప్రభుత్వ మోడల్ స్కూల్ లో 10వ తరగతి చదువుతున్న కట్కూరి విష్ణుదీప్, బ్యాక్ స్ట్రోక్ 100 మీటర్ల విభాగంలో సత్తా చాటుకొని గోల్డ్ మెడల్ సాధించాడు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విష్ణుదీప్ ను, స్కూల్ ప్రిన్సిపాల్ అంతర్గాం జెడ్పీహెచ్ఎస్ పీడీ శోభారాణి, స్విమ్మింగ్ కోచ్ కృష్ణమూర్తి అభినందించారు. అలాగే గ్రూప్1 ఫ్రీస్టైల్ 100 మీటర్ల విభాగంలో కె.బాలాజీ ప్రథమ స్థానం,ఎం.అర్జున్ ద్వితీయ స్థానం దక్కించుకున్నారు.బటర్‌ఫ్లై 100 మీటర్లలో ఎం.అర్జున్ ప్రథమ స్థానం సాధించగా,కే.ప్రణీత్ రెండో స్థానంలో నిలిచారు.చిన్నారుల నుంచి యువకుల వరకు క్రీడాకారులు తమ ప్రతిభను చాటుతూ ప్రేక్షకులను అలరించారు.ఈ పోటీల్లో కేజీబీవీ అంతర్గాం పీఈటీ మౌనిక,కేజీబీవీ రామగుండం పీఈటీ నిర్మల, కృష్ణవేణి స్కూల్ పీఈటీ అంజలి పాటు ఇతర క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభ ను ప్రదర్శించారని జిల్లా యువజన మరియు క్రీడా అధికారి ఏ.సురేష్ తెలిపారు. జిల్లాలో క్రీడల అభివృద్ధికి సీఎం కప్ పోటీలు దోహదపడుతున్నాయని అన్నారు.

## ఎన్నికల నేపథ్యంలో మద్యం దుకాణాలు బంద్

**-ఆప్కారి సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ మంగమ్మ**



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ ఫిబ్రవరి 9 :** పెద్దపల్లి జిల్లా రామగుండం మండలం రామగుండం కార్పొరేషన్ మున్సిపల్ ఎన్నికల దృష్ట్యా మద్యం దుకాణాలు మూసి వేయడం జరుగుతుందని ఆప్కారి సిఐ మంగమ్మ తెలిపారు.రామగుండం ఎక్సైజ్ ఆప్కారి సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ మంగమ్మ మాట్లాడుతూ రామగుండం మున్సిపాల్ ఎన్నికల నేపథ్యంలో పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశాల మేరకు ఫిబ్రవరి 9 సాయంత్రం 5:00 నుండి 11వ తేదీ ఎన్నికల పోలింగ్ మూసే వరకు నగరపాలక పరిసర ప్రాంతాల్లో మద్యం దుకాణాలు మూసివేయాలని, ఒకవేళ ఎన్నికల కోడ్ ను ఉల్లంఘించి మద్యం విక్రయాలు కొనసాగించినట్లయితే వారిపై చట్టపరంగా శిక్ష విధించబడునని, ఎన్నికల కోడ్ ను ఉల్లంఘించరాదని రామగుండం ఎక్సైజ్ ఆప్కారి సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ మంగమ్మ తెలిపారు.

# ఆర్థిక స్వావలంబనే ధ్యేయంగా మునిసిపాలిటీలు ఉండాలి

**-రాయికల్‌లో గులాబీ జెండా ఎగరవేస్తాం**
**-జగిత్యాలలో ఊహించని విధంగా మెజార్టీ సీట్లు సాధిస్తాం**
**-బిఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎల్.రమణ**



**చురకలు ప్రతినిధి,జగిత్యాల, ఫిబ్రవరి 9 :** ఆర్థిక స్వావలంబనే ధ్యేయంగా మునిసిపాలిటీలు ఉండాలని, రాయికల్‌లో గులాబీ జెండా ఎగర వేస్తామని,జగిత్యాలలో ఊ" హించని విధంగా మెజార్టీ సీట్లు సాధిస్తామని, బిఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎల్.రమణ అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్సీ ఎల్ రమణ ఆయన నివాసం లో మీడియా సమావేశం నిర్వహించారు .ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎల్.రమణ మాట్లాడుతూ మునిసిపాలిటీలు ఆర్థిక స్వావలంబనే ధ్యేయంగా,రాజ్యాంగం ప్రకారం ప్రధానంగా బల్దియాల్లో అవకతవకలకు అవకాశం లేకుండా ఉండాలన్నారు.మునిసిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ హాయంలో జరిగిన అభివృద్ధిని ప్రజల ముందుంచామని,అధికారపార్టీ వైఫల్యాలను ఎండగట్టామన్నారు. ప్రజాక్షేత్రంలో బీఆర్ఎస్ ప్రచారానికి అపూర్వ స్పందన లభించిందని, జగిత్యాల నియోజకవర్గంలోని రాయకల్,జగిత్యాల పట్టణంలో గులాబీ జెండా ఎగరవేస్తున్నామని, జగిత్యాల మున్సిపాలిటీలో ఊహించని తీర్పును ప్రజలు ఇవ్వబోతున్నారన్నారు.ప్రధాన పార్టీలు ఇచ్చిన హామీలు విస్మరించాయని,గులాబీ సైనికులకే ప్రజలు పట్టం కట్టబోతున్నారన్నారు. నిఖార్సయిన గులాబీ సైనికులకు, నిబద్ధత కలిగిన నిజాయితీపరులకే సీట్లు ఇచ్చామని,జగిత్యాలలో గులాబి జెండా హవా నడుస్తోందని,ఓటర్లను ఎన్ని రకాలుగా ప్రలోభ పెట్టినా వారు స్పష్టంగా ఉన్నారన్నారు.జగిత్యాల అభివృద్ధిపై వైరల్ అవుతున్న వీడియోలు బిఆర్ఎస్ హయాంలో చేసినవేనని, రెండేళ్లలో అక్కడక్కడ సీసీ రోడ్లు తప్ప చేసిందేమీ లేదన్నారు.ప్రశ్నించే గొంతుకలకు ప్రజలు ఓటేయబో తున్నారని, ఈ ఎన్నికల్లో ఓటర్లు విలక్షణ తీర్పు ఇస్తారన్నారు.మెడికల్ కళాశాల,నర్సింగ్ కళాశాల,మాత శిశు కేంద్రం,చింతకుంట చెరువు అభివృద్ధి ఘనత బిఆర్ఎస్‌నని,4520 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మాజీ సీఎం కేసీఆర్ ఇచ్చినవేనని,అప్పుడే స్వయంగా మాజీ మంత్రి కేటీఆర్ లబ్ధిదారులకు అందించారని ఎమ్మెల్సీ ఎల్.రమణ గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు దావ సురేష్, ఎల్.కార్తికేయ,పట్టణ అధ్యక్షులు అయిల్నేని వెంకటేశ్వర్ రావు, ప్రధాన కార్యదర్శి అల్లాల ఆనంద్‌రావు,మాజీ జడ్పీటీసీ కొలుముల రమణ,శీలం ప్రవీణ్,ఆసీఫ్,అనంతుల గంగారెడ్డి, పడిగేల గంగారెడ్డి,ఎండబెట్ల ప్రసాద్, వొళ్ళాల గంగాధర్,వనమాల నిరంజన్, కుడిక్యాల సర్వేశ్వర్,అజ్జర్‌ఖాన్,వసీం, గంగిపెల్లిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# పలు వార్డుల్లో బిఆర్ఎస్ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం

**-ప్రచారంలో పాల్గొన్న మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, మాజీ మంత్రి రాజేశం గౌడ్**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఫిబ్రవరి 9 :** జగిత్యాల పట్టణంలోని 7, 14,15, 16, 28, 29, 32, 38 వార్డులలో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు కోరుగంటి రాము, దొనకంటి హరిత కృష్ణ, మల్లీశ్వరి నక్క గంగాధర్, చిట్యాల లత నారాయణ, నచుపెల్లి రాధ రెడ్డి, బొల్లరపు కళ్యాణి నవీన్,, తాడెపు మానస మహేశ్ లకు మద్దతుగా మాజీ జడ్పీ చైర్మన్ దావ వసంత సురేష్, మాజీ మంత్రి రాజేశం గౌడ్ ఇంటింటా తిరిగి ప్రచారం చేశారు.ఈ సందర్భంగా మాజీ జడ్పీ చైర్పర్సన్ దావ వసంత సురేష్ మాట్లాడుతూరెండు సంవత్సరాల కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలు విసుగు చెందారన్నారు. ఓటు అనే ఆయుధంతో కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. జగిత్యాల పట్టణానికి 4500 డబ్బులు మంజూరు చేసి పేదల గుండెల్లో కేసీఆర్ ఉన్నారని, పేద ప్రజల బాగుండాలని ఆలోచించే నాయకుడు కేసీఆర్ అని అన్నారు. గత పది సంవత్సరాలలో జగిత్యాల పట్టణం అభివృద్ధి జరిగిందని, జగిత్యాల పట్టణ ప్రజలందరూ ఒక్కసారి ఆలోచించి కారు గుర్తుకే ఓటు వేయాలన్నారు. జగిత్యాల పట్టణంలోని 49 వార్డులో ఉన్న బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని జగిత్యాల పట్టణ ప్రజలను కోరారు. జగిత్యాల బల్దియా పై తప్పకుండా గులాబీ జెండా ఎగరవేస్తామన్నారు.



# కాంగ్రెస్ కౌన్సిలర్ అభ్యర్థులను గెలిపించాలని ప్రచారం



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ప్రతినిధి 09 :** సిరిసిల్ల మున్సిపాలిటీ లోని కాంగ్రెస్‌పార్టీకౌన్సిలర్ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎల్లారెడ్డిపేట కాంగ్రెస్‌పార్టీ నాయకులు చివరి రోజు సోమవారం వరకు విస్తృత ప్రచారాన్ని కొనసాగించారు.20వార్డు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి ఇప్పపూల లక్ష్మణ్‌ను 27వ వార్డు కాంగ్రెస్ పార్టీకౌన్సిలర్ అభ్యర్థి అంజూమ్ ఆరా బేగంను 31వార్డు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థి భూర్ల సరోజన గంగయ్యకు మద్దతుగా ఎల్లారెడ్డిపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సద్ది లక్ష్మారెడ్డి బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు దొమ్మాటి నరసయ్య ఏఎంసీ చైర్మన్ షేక్‌సాబేరా బేగం,గౌస్ ఎల్లారెడ్డిపేట మాజీ సర్పంచ్ నేవూరి వెంకటరెడ్డిలు వారికి కేటాయించిన వార్డులలో సోమవారం వరకు విస్తృతం గా ఎన్నికల ప్రచారాన్ని కొనసాగిం చారు,కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నందున ఆయా వార్డులు అభివృద్ధి చెందాలంటే రేషన్ కార్డు లేనివారికి రేషన్ కార్డులు ఇల్లు లేని నిరుపేద లందరికీ ఇందిరమ్మ ఇల్లు ,అన్ని రకాల పెన్షన్లు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులను గెలిపించినట్లయి తేనే అవి సాధ్యమని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రచారం చేశారు.రేవంత్ రెడ్డి సర్కార్ చేపడుతున్న అభివృద్ధిని సంక్షేమాన్ని చూసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపిం చాలని వారు ఓటర్లను అభ్యర్థించారు. కాంగ్రెస్ బిజెపి అభ్యర్థుల కంటే ప్రచారంలో గెలుపులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు అయా వార్డులలో ముందంజ లో ఉన్నారు.ఎన్నికల ప్రచారంలో ఆయా వార్డులలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యాక్షులు షేక్ గౌస్ బాయ్ ఏఎంసి వైస్ ప్రెసిడెంట్ గుండాడి రాంరెడ్డి,రేవంత్ మిత్ర మండలి ప్రెసిడెంట్ గూడ విజయ్ రెడ్డి, ఉప సర్పంచ్ మధుసూదన్‌రెడ్డి,నాయకులు బండారిబాల్రెడ్డి,కదిరి శ్రీనివాస్ గౌడ్, గొల్లపల్లి మల్లేశం, దండు శ్రీనివాస్ సిరిపురం మహేందర్, మండే శ్రీనివాస్ యాదవ్ నెమలికొండ సత్తయ్య, సాయి ప్రేమ్,గుర్రాల రాజిరెడ్డి, వంగ శ్రీకాంత్ రెడ్డి,షకీల్ ఎల్లారెడ్డిపేట మండలానికి చెందిన జిల్లా స్థాయి మండల స్థాయి గ్రామస్థాయి నాయకులతో పాటు కాంగ్రెస్ పార్టీ సర్పంచులు ఉప సర్పంచ్లు ఆయా వార్డులలో ఎన్నికల ప్రచారాన్ని కొనసాగించారు.

# చివరిరోజు హోరెత్తిన ప్రచారం

**-రేపే మున్సిపల్ పోలింగ్**
**-త్రిముఖ పోటీలో విజయం ఎవరిదో?**
**-30 వార్డుల్లో హోరాహోరీ**




**(కోరెం సుధాకర్ రెడ్డి, చురకలు ప్రతినిధి, హుజురాబాద్)**

హుజురాబాద్ పట్టణంలో మున్సిపల్ పోరులో చివరిరోజు ప్రచారం హోరెత్తింది. బుధవారం పోలింగ్ జరగనుండగా సోమవారం సాయంత్రం ఎన్నికల ప్రచారం ముగిసింది. దీంతో గత వారం రోజులుగా హోరెత్తిన ప్రచార వేడి ఒక్కసారిగా చల్లారింది. 30 వార్డుల్లో కౌన్సిలర్లుగా పోటీ చేస్తున్న కౌన్సిలర్ అభ్యర్థులు వారం రోజుల పాటు ప్రచారాన్ని ఉధృతంగా నిర్వహించారు. వార్డుల్లో మైకులతో వాహనాలు ఏర్పాటు చేసారు. ఫ్లెక్సీలు, పోస్టర్లు, కరపత్రాలు, నమూనా బ్యాలెట్ తో ఇంటింటికి తిరుగుతూ ప్రచారం చేసారు. కొందరు అభ్యర్థులు సుమారు వంద మందితో ఇంటింటికి తిరుగుతూ ఓటర్లకు దండంపెడుతూ కనిపించారు. అభ్యర్థులు ఒక్కో ఇంటిని సుమారు 10 సార్లకు పైగా సందర్శించారు. వ్యూహాలు ప్రతి వ్యూహాలు చేసారు.

**ఓటర్లకు ప్రలోభాలు**

వార్డుల్లో ఓటర్లను మచ్చిక చేసుకునేందుకు అభ్యర్థులు మందు, విందులు ఏర్పాటు చేసారు. సుదూర ప్రాంతాల్లో ఉన్న వారిని రప్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. వారికి రానూపోనూ ఖర్చులు చెల్లిస్తున్నారు. ఓటర్లకు డబ్బు పంపిణీ కూడా ప్రారంభమైంది. వార్డుల్లో పోటీనిబట్టి డబ్బులు ఇస్తున్నారు. జమ్మికుంట రోడ్డులోని ఓ వార్డులో ఓటుకు రూ. 2 వేల చొప్పున ఓ అభ్యర్థి అందిస్తున్నట్లు తెలుస్తోంది. బుధవారం పోలింగ్ జరగనుండడంతో.. ఒకరోజు ముందు అంటే మంగళవారం సాయంత్రం నుండి డబ్బు పంపిణి ప్రారంభం కానుంది. ఐతే కొందరు అభ్యర్థులు తమకు నమ్మకంగా పడే ఓటర్లకు మాత్రమే ఇస్తున్నారు. ఒక వార్డులో వెయ్యి ఓట్లు ఉంటే ఎంపిక చేసిన 7 నుండి 8 వందల మందికి డబ్బులు ఇస్తున్నట్లు తెలుస్తోంది.

**త్రిముఖమేనా?**

హుజురాబాద్ మున్సిపాలిటీలో అన్ని వార్డుల్లో త్రిముఖ పోటీ నెలకొంది. కొన్ని చోట్ల ఇండిపెండెంట్లు కూడా బలమైన పోటీ ఇస్తున్నారు. గతంలోకంటే బలమైన పోటీ బీజేపీ ఇస్తోంది. ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి బి ఆర్ ఎస్ నుండి స్థానికంగా శాసన సభ్యునిగా ప్రాతినిధ్యం వహించడం, అలాగే కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండడంతో పోటీ హోరాహోరీగా సాగింది. కాంగ్రెస్ నేత ప్రణవ్ తో పాటు మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే నవీన్ యాదవ్ కాంగ్రెస్ ప్రచారంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పెద్ద ఎత్తున అన్ని వార్డుల్లో సభలు, ర్యాలీలు నిర్వహించారు. అయన సతీమణి శాలినిరెడ్డి కూడా ప్రచారంలో పాల్గొన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ బీజేపీ ప్రచారం నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ఆ పార్టీ ప్రచార బాధ్యతలు నిర్వహించారు. నియోజకవర్గంలోని హుజురాబాద్, జమ్మికుంట మున్సిపాలిటీలను కైవసం చేసుకోవడం కాంగ్రెస్ బి ఆర్ ఎస్ లకు ప్రతిష్టాత్మకంగా మారింది. తమ ఆధిపత్యం చాటుకునేందుకు హోరాహోరీగా పోరాడుతున్నారు.

**ఎన్నికలకు ఏర్పాట్లు**

ప్రచారం ముగియడంతో ఒకవైపు రాజకీయ పార్టీల నేతలు తెరవెనుక మంత్రాంగాలు నడుపుతుండగా.. మరోవైపు అధికార యంత్రాంగం పోలింగ్ ఏర్పాట్లు చేస్తోంది. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ఏర్పాటు చేసారు. పోలింగ్ సిబ్బంది మంగళవారం ఉదయం రిపోర్ట్ చేయనున్నారు. మధ్యాహ్నం పోలింగ్ బాక్సులతో,స్ సామగ్రితో పోలింగ్ కేంద్రాలకు తరలిపోనున్నారు. ఏసిపి మాధవి, సి ఐ కరుణాకర్ ఆధ్వర్యంలో పోలీసు శాఖ పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాటుకు, కట్టుదిట్టమైన భద్రతకు సమాయత్తం అవుతోంది. బుధవారం ఉదయం నుండి మధ్యాహ్నం వరకు పోలింగ్ జరగనుంది. అభ్యర్థుల భవితవ్యం బాక్సుల్లో భద్రం కానుంది.